
ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక
Bullet Edition
శనివారం 13 డిసెంబరు 2025 www.prajaswaramdaily.com 2 pm

# నవ వధువు ఆత్మహత్య



మూసాపేట, ప్రజాస్వరం
పెళ్లైన 3 నెలలకే నవ వధువు ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మూసాపేటలో ఘటన జరిగింది. చందన జ్యోతికి, యశ్వంత్‌కు 3 నెలల క్రితం వివాహం అయ్యింది. కొద్ది రోజుల పాటు సంసారం సవ్యంగా సాగింది. ఇటీవల దంపతులు తరచూ గొడవలు పడుతున్నారు. ఈ క్రమంలో జ్యోతి ఆత్మహత్య చేసుకుందని సమాచారం.

# మెస్సీ అభిమానుల ఆగ్రహం

**కోల్‌కతా టూర్‌లో గందరగోళం**

**అభివాదం చేసి వెళ్లిపోయిన మెస్సీ**


**మ్యాచ్ ఆడకుండా వెళ్లిపోవడంతో నిర్వాహకుల తీరుపై అసహనం**

**స్టేడియంలోకి విసిరిన కుర్చీలు, బాటిల్స్**

**సీట్లు ధ్వంసం, ఫ్లెక్సీలు చించివేత**

**బారికేడ్లు దాటుకొని చొచ్చుకెళ్లేందుకు యత్నం**

**సొరంగం ద్వారా స్టేడియం బయటకు..మెస్సీ టీం**







పది నిమిషాల్లో వెళ్లిపోయిన మెస్సి

కోల్ కత్తా , ప్రజాస్వరం
మెస్సీ కోల్ కతా పర్యటనలో గందరగోళం ఏర్పడింది. తన టూర్ లో భాగంగా ఇవాళ ఉదయం మెస్సీ .. లేక్ స్టేడియంలో జరిగిన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫ్రెండ్లీ మ్యాచ్ ఉంటుందని నిర్వాహకులు ప్రకటించారు. దీంతో మెస్సీ మ్యాచ్ చూసేందుకు భారీ సంఖ్యలో ఆయన అభిమానులు స్టేడియానికి చేరుకున్నారు. ఆయన ఎలాంటి మ్యాచ్ ఆడలేదు. కేవలం ప్రేక్షకులకు అభివాదమే చేశారు. దీంతో మెస్సీ మ్యాచ్ ఆడకుండా త్వరగా వెళ్లిపోవడం పట్ల నిర్వాహకుల తీరుపై అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టేడియంలోకి కుర్చీలు, వాటర్ బాటిళ్లు విసిరేశారు. స్టేడియంలో సీట్లు ధ్వంసం చేసి, ఫ్లెక్సీలు చింపేశారు. బారికేడ్లు దాటుకుని చొచ్చుకెళ్లేందుకు ఫ్యాన్స్ ప్రయత్నించారు. దీంతో అక్కడ ఒక్కసారిగా గందరగోళం ఏర్పడింది. అభిమానులు గొడవ చేయడంతో మెస్సీ టీమ్ సొరంగం ద్వారా స్టేడియం నుంచి బయటకు వెళ్లిపోయింది. గందరగోళం నేపథ్యంలో ఫ్యాన్స్‌ను అదుపుచేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సి 'గోట్ టూర్ ఆఫ్ ఇండియా'లో పాల్గొంటున్నాడు. ఈనేపథ్యంలో మెస్సిని దగ్గరి నుంచి చూడాలని, అతడి ఆటను వీక్షించాలని కొన్ని రోజులుగా అభిమానులు ఎదురుచూశారు. ఇలాంటి సమయంలో అతడు అలా వచ్చి.. ఇలా స్టేడియం నుంచి వెళ్లిపోవడాన్ని అభిమానులు తట్టుకోలేకపోయారు. స్టేడియంలో పట్టుమని 10 నిమిషాలు కూడా ఉండలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

# ఈవెంట్ మేనేజర్‌లా సీఎం రేవంత్‌రెడ్డి

**ప్రజా సమస్యలు పక్కన పెట్టి మెస్సితో ఫుట్‌బాల్ ఆట..**

**సింగరేణి డబ్బులు రూ.. 100 కోట్లు పెట్టారు**

**ఎంపీ ఈటల**



హనుమకొండ, ప్రజాస్వరం
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈవెంట్ మేనేజర్‌లా వ్యవహరిస్తున్నారని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజా సమస్యలు పక్కన పెట్టి మెస్సితో ఫుట్‌బాల్ ఆడుతున్నారని మండిపడ్డారు. సింగరేణిలో క్వార్టర్లు బాగు చేయడానికి, సిబ్బందికి జీతాలు ఇవ్వడానికి డబ్బులు లేవు అని, కానీ సింగరేణి డబ్బులు రూ.100 కోట్లు పెట్టి ఫుట్‌బాల్ మ్యాచ్ ఆడుతున్నారని విమర్శించారు. పేదల ఇళ్లను కూలుస్తున్న హైడ్రా.. పెద్దల కబ్జాను పట్టించుకోవడం లేదని, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత చేసిన ఆరోపణలపై ప్రభుత్వం విచారణ చేపట్టాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గుర్తులు ఉండవు అని, ఈ ఎన్నికలంటేనే అధికార పార్టీకి అనుకూలంగా ఉంటాయని, అధికారంలో ఉన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ 50 శాతం కూడా గెలవలేదన్నారు.. గెలిచిన వారిని తమ ఖాతాలో వేసుకునే ప్రయత్నం చేస్తోందన్నారు. ప్రజలకు ఆ పార్టీ పట్ల ఎంత విముఖత ఉందో దీన్ని బట్టి అర్థం చేసుకోవాలి" అని ఈటల రాజేందర్ అన్నారు.

# భార్యను ఉరేసి చంపి, భర్త ఆత్మహత్య



జయశంకర్ భూపాలపల్లి , ప్రజాస్వరం
భార్యను ఉరేసి చంపి, భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా సీతారాంపురం గ్రామంలో ఘటన జరిగింది. భార్య, కూతురు వేధింపులు తట్టుకోలేకనే ఘాతుకానికి పాల్పడినట్లు తెలుస్తోంది. భార్యను చంపిన తర్వాత వీడియో తీసి వాట్సాప్ స్టేటస్ గా భర్త రామాచారి పెట్టాడు.

# నేను ఓడాను ..నా డబ్బులు నాకివ్వండి




**బీఆర్ ఎస్ ఓడిన అభ్యర్థి**

**10 లక్షలకు పైగా ఓట్లకు ఖర్చు చేశానని వెల్లడి**

నల్లగొండ, ప్రజాస్వరం
నేను ఓడిపోయాను ..నా డబ్బులు నాకివ్వండి అంటూ దేవుడి ఫొటోతో ఓడిన బీఆర్ఎస్ అభ్యర్థి ఇంటింటికీ తిరుగుతున్నారు. నల్గొండ జిల్లా ఔరవాణి గ్రామంలో ఈ ఉదంతం వెలుగుచూసింది. పంచాయతీ ఎన్నికలలో బీఆర్ఎస్ అభ్యర్థి ఓడిపోయారు. రూ. 10 లక్షలకు పైగా ఓట్ల కోసం ఖర్చు చేశానంటున్నారు. 50 లేదా 60 ఓట్ల తేడాతో ఓడిపోతే డబ్బులు అడగకపోయేవాళ్లమన్నారు. 450 ఓట్లతో ఓడిపోయినందుకు తిరిగి అడుగుతున్నామని ఓటర్లకు తెలియజేశారు.


# మరికొన్ని గంటల్లో హైదరాబాద్ కు మెస్సీ..



హైదరాబాద్, ప్రజాస్వరం
కోల్ కతా స్టేడియంలో ఉద్రిక్తత నేపథ్యంలో హైదరాబాద్ లో భద్రత కట్టుదిట్టం చేశారు. ఇప్పటికే 3 వేల మందితో మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. 450 సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో భద్రతను పర్యవేక్షిస్తున్నారు. ఉప్పల్ స్టేడియంలో డాగ్ స్క్వాడ్ తో విస్తృత తనిఖీలు చేశారు. డిజిటల్ పాస్ ఉంటేనే స్టేడియంలోకి అనుమతిని ఇస్తారు. సీఎం, మెస్సీ టీం మధ్య మ్యాచ్ జరగనుంది. పెనాల్టీ షూట్ అవుట్ వేసి మెస్సీ వెళ్తారని సమాచారం

# స్టేజ్ -2 ఆర్వో సస్పెండ్

ఎన్నికల సామగ్రి భద్రపరచడంలో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై విచారణకు రాష్ట్ర ఎన్నికల సంఘం(ఎస్ఈసీ) ఆదేశించింది. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నల్గొండ కలెక్టర్ ఇలా త్రిపాఠికి ఆదేశాలు జారీ చేసింది.



**సస్పెండ్**

బ్యాలెట్ పేపర్ ఓట్లు డ్రైనేజీలో లభ్యమైన ఘటనను పై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించారు. ప్రాథమిక విచారణలో ఎన్నికల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం, అవకతవకలు జరిగినట్లు తేలడంతో స్టేజ్ -2 ఆర్వోను సస్పెండ్ చేశారు. మొత్తానికి, తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో చోటుచేసుకున్న ఈ ఘటన.. రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు రేపుతోంది. పూర్తి స్థాయి దర్యాప్తు అనంతరం నిజానిజాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

## డ్రైనేజీలో బీఆర్ఎస్ బ్యాలెట్ పేపర్స్ ఘటన

నల్లగొండ, ప్రజాస్వరం
ఓ డ్రైనేజీ కాల్వలో పోలైన బ్యాలెట్ పేపర్ ఓట్లు లభ్యమవడం తీవ్ర దుమారం రేపింది. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామంలో వెలుగుచూసిన ఘటన రాజకీయ వర్గాల్లో సంచలనం సృష్టించింది. ముఖ్యంగా ఆ బ్యాలెట్ పేపర్లన్నీ బీఆర్ఎస్ మద్దతిచ్చిన అభ్యర్థికి సంబంధించిన 'కత్తెర' గుర్తుకు వేసినవే కావడంతో ఎన్నికల రిగ్గింగ్‌పై అనుమానాలు మరింత బలపడ్డాయి. ఈ ఘటనపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. విషయం తెలిసిన వెంటనే డ్రైనేజీ వద్దకు చేరుకున్న ఆయన అక్కడి పరిస్థితిని పరిశీలించి ఎన్నికల అధికారులను, పోలీసులను ప్రశ్నించారు. తమ అభ్యర్థులను రాజకీయంగా ఎదుర్కోలేని కాంగ్రెస్ నేతలు దొంగదారిలో రిగ్గింగ్‌కు పాల్పడ్డారని జగదీష్ రెడ్డి ఆరోపించారు. గులాబీ పార్టీ మద్దతిచ్చిన అభ్యర్థులు గెలిచే అవకాశాలు కనిపించడంతోనే కుట్రపూరితంగా బ్యాలెట్ పేపర్లను తొలగించి డ్రైనేజీలో పడేశారని విమర్శించారు. ఇది కేవలం చిన్నకాపర్తి గ్రామానికే పరిమితం కాదని, ఇలానే జిల్లాలోని అనేక గ్రామాల్లో కాంగ్రెస్ నేతలు అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలు గుప్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, భూపాల్ రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్‌లపై జగదీష్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వీరంతా కలిసి కాంగ్రెస్ పార్టీ తరఫున రిగ్గింగ్‌కు పాల్పడ్డారని ఆరోపిస్తూ, ప్రజల తీర్పును మోసం చేశారని ఫైరయ్యారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన ఈ చర్యలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# మంత్రాల నెపంతో ఒకరి హత్య

**నిర్మల్ జిల్లాలో ఘటన**




కడెం, ప్రజాస్వరం
మంత్రాల నెపంతో ఒకరిని హత్య చేశారు. ఈ సంఘటన నిర్మల్ జిల్లాలో చోటు చేసుకుంది . పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని కడెం మండలం ఉడుంపూర్ పంచాయతీ .. గండి గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన దేశినేని భీమయ్య (55) అనే వ్యక్తిని ఈ నెల 10న రాత్రి అదే గ్రామానికి చెందిన మూతి నరేశ్ (21), అతని అన్న మల్లేశ్ (23) హత్య చేశారు. గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో అతడి మృతదేహాన్ని కాల్చి బూడిద చేశారు. ఖానాపూర్ సీఐ అజయ్, కడెం ఎస్సై సాయి కిరణ్ సంఘటనా స్థలానికి చేరుకొని హత్యకు గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. భీమయ్య మంత్రాలు చేస్తున్నాడనే నెపంతో హత్య చేసినట్లు విచారణలో నిందితులు తెలిపారని పోలీసులు వెల్లడించారు.